క్లుప్తంగా...

కాంగ్రెస్ పాలనలోనే పేదల సంక్షేమం: విజయారెడ్డి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి



మక్తాలో ప్రచారం చేస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: గడచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపై రూ. 1.50 లక్షల అప్పు భారం తయారైందని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ అభ్యర్థి పి.విజయారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సోమాజిగూడ డివిజన్ బీఎస్ మక్తాలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల స్కీంలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మాటలు ఇకపై ప్రజలు నమ్మేపరిస్థితుల్లో లేరని నోరుతెరిస్తే అన్ని అపద్ధాలు, వారు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేరని విమర్శించారు. పేదలందరికీ న్యాయం జరగాలంటే కాంగ్రెస్ వల్లే సాధ్యమని ఈ విషయాన్ని ప్రజలు కూడా తెలుసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పలు డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ లేదు.. బడి లేదు!

వెంకటేశ్వరకాలనీ: ఎన్నికల విధుల్లో భాగంగా శనివారం నియోజకవర్గంలోని చాలా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణకు వెళ్లారు. దీంతో ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు సెలవు ప్రకటించారు. కానీ ఈ విషయం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయకపోవడంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. బంజారాహిల్స్ రోడ్ నెం7లోని గతి స్కూల్ విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తర్వాత టీచర్ లేదు ఇవాళ మీకు సెలవు అని చెప్పడంతో ఉసూరుమంటూ ఇంటి బాట పట్టారు.

సందడిగా అలయ్ బలయ్



అలయ్ బలయ్‌లో పాల్గొన్న జూటూరి కీర్తిరెడ్డి

బంజారాహిల్స్: బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ నేత ఆలపాటి లక్ష్మీనారాయణ జూబ్లీహిల్స్‌లో తన నివాసంలో ఏర్పాటు చేసిన దసరా అలయ్ బలయ్ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. పలు పార్టీలకు చెందిన నేతలతో పాటు బీజేపీ నేతలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జూటూరి కీర్తిరెడ్డితో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు ఈ వేడుకకు హాజరయ్యారు. దసరా పర్వదినం సందర్భంగా అలయ్‌బలయ్‌లో వీళ్లంతా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఏటా కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా తాను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటానని ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆబాద్ పార్టీ ఆవిర్భావం

పంజగుట్ట: భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు తప్పక అమలు చేయాలనే దృఢ సంకల్పంతో పుట్టిందే ఆబాద్ పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హసన్ షేక్ అన్నారు. ప్రజల చేత, ప్రజలకొరకు ప్రజలచే పాలింపబడే ప్రభుత్వం రావాలనే ఆశయ సాధనే లక్ష్యంగా ఆబాద్ పార్టీ పనిచేస్తుందన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గోవింద్ రాజన్, బైరి రాణి, దినకర్‌లతో కలిసి మాట్లాడుతూ... కుల, మత, వర్గ, ప్రాంతాల పేరుతో ప్రజలమధ్య చిచ్చుపెడుతూ రాజకీయంగా లబ్ధి పొందాలనుకునే పార్టీలకు వ్యతిరేకంగా ఆబాద్ పార్టీ పనిచేస్తుందన్నారు.

ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటనపై వినోద్‌రెడ్డి అసంతృప్తి



వినోద్‌రెడ్డి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ అధిష్టానం రెండవ విడత ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనపై ఆ పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖైరాతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పి.విజయారెడ్డికి టికెట్ కేటాయించడంపై సొంత పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా జెండా మోసి పనిచేసినా తన పేరు పరిగణనలోకి తీసుకోకపోవడంపై నియోజకవర్గ సీనియర్ నేత, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గ టికెట్ విషయంలో సైతం తనకు అవకాశం కల్పించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి అవకాశం ఇవ్వడం దారుణమని ఆయన మండిపడ్డారు.

ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

- పోలింగ్ ముందు రోజు నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు
- ఎన్నికల సామగ్రిపై పూర్తి అవగాహన అవసరం
- సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారులను సంప్రదించాలి
- పీవో, ఏపీవో అధికారులకు శిక్షణ
- ఎన్నికల నిర్వహణ తీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్



పీవో, ఏపీవోలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు, ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాలు



బంజారాహిల్స్: ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచే డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ (డీఆర్‌సీ) నుంచి పోలింగ్ కేంద్రంలో వాటిని అమర్చి తిరిగి వాటిని మళ్లీ డీఆర్‌సీ సెంటర్‌కు చేర్చే వరకు ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పీవో), ఏపీవో (అసిస్టెంట్ ప్రిసైడింగ్) ఆఫీసర్ల పాత్ర కీలకమని మాస్టర్ ట్రైనర్లు సూచించారు.

- ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్లు, ఎన్నికల నియమావాళిపై శిక్షణ ఇచ్చారు.
- పోలింగ్ రోజున ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటర్లకు కావాల్సిన సౌకర్యాలపై పలు సూచనలు జారీచేశారు. ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ముందుగానే కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని వెల్లడించారు. పోలింగ్ అధికారులు ఈవీఎం యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు.
- మాక్ పోలింగ్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ పనితీరు, మరమ్మతులు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు.
- ఒకటికి, రెండు సార్లు ప్రతి ఈవీఎంను సరి చూసుకోవాల్సిన బాధ్యత పీవోలపై ఉందని స్పష్టం చేశారు.
- ఈవీఎంల వీవీ ప్యాట్లు ఎలా అనుసంధానించాలో అధికారులకు మాస్టర్ ట్రైనర్లు సూచించారు. దీని ద్వారా ఓటరు ఏ గుర్తుకు ఓటు వేశారో తెలుసుకునే అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలో పొందుపరుస్తున్నారని ఈవీఎం పై పార్టీ చిహ్నం, అభ్యర్థి పేరుతో పాటు ఫొటో కూడా కనిపిస్తుందని వారు వెల్లడించా.

జంగ్ తెలంగాణ 2023

సమావేశంలో సూచించిన అంశాలు ఇవే...

- డీఆర్ఎస్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లడం.
- పోలింగ్ స్టేషన్‌లో అమర్చుకోవడం.
- ఈవీఎం మిషన్‌లో బ్యాలెట్ పేపర్ అమర్చడం, సీలింగ్ చేయడం, వీవీ ప్యాట్ యంత్రానికి కనెక్షన్ ఇవ్వడం.
- పోలింగ్ పూర్తయిన వెంటనే యధావిధిగా వాటిని డీఆర్‌సీ సెంటర్‌లో అప్పగించడం.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు వీరే...

ఖైరతాబాద్ నుంచి విజయారెడ్డి



నియోజకవర్గం: ఖైరతాబాద్
అభ్యర్థి పేరు: పి.విజయారెడ్డి
భర్త: జి.భగవత్‌రెడ్డి
పుట్టిన తేదీ: 25-10-1979
విద్యార్హత: బీఈ కంప్యూటర్స్, ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్) జేబీఐటీ, పీహెచ్‌డీ (జేఎన్‌టీయూ)
తండ్రి: పి.జనార్ధన్‌రెడ్డి,
తల్లి: ఇందిరా జనార్ధన్‌రెడ్డి
రాజకీయ నేపథ్యం: 2016-21, 2021 నుంచి ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు.

బంజారాహిల్స్: తండ్రి పీజేఆర్ మరణం తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన విజయారెడ్డి గతంలో శేరిలింగపల్లిలో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2016లో బీఆర్ఎస్‌లో చేరిన విజయారెడ్డి ఖైరతాబాద్ డివిజన్ నుంచి రెండోసారి కార్పొరేటర్‌గా ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జూబ్లీహిల్స్ నుంచి అజహరుద్దీన్



నియోజకవర్గం: జూబ్లీహిల్స్
అభ్యర్థి పేరు: మహమ్మద్ అజహరుద్దీన్
వయసు: 60
విద్యార్హత: బీకాం
అవార్డులు: టీం ఇండియా మాజీ కెప్టెన్, అర్జున, పద్మశ్రీ అవార్డుల గ్రహీత
రాజకీయ నేపథ్యం: 2009లో మోరదాబాద్ నుంచి ఎంపీగా ఎన్నిక, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, టీం ఇండియా మాజీ సారథి మహమ్మద్ అజహరుద్దీన్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్‌ను ఖరారు చేసింది. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి నుంచి పోటీ ఎదురైనా అధిష్టానం అజహరుద్దీన్‌పై నమ్మకం ఉంచింది. లక్షకుపైగా ఉన్న మైనార్టీ ఓట్లు, క్షేత్రస్థాయి ఓటు బ్యాంకు, సెలబ్రిటీ హోదాతో పాటు సెటిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతారనే ఆశావహ దృక్పథం కలిసివస్తుందని అధిష్టానం భావించింది. 2009లో ఉత్తరప్రదేశ్ మోరదాబాద్‌కు ఎంపీగా అజహరుద్దీన్ ప్రాతినిధ్యం వహించారు.

కాంగ్రెస్ వాళ్లు అభివృద్ధి నిరోధకులు

- వారికి ఓటేస్తే జనం బతుకులు ఆగమే
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



దానం నాగేందర్

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దుయ్యబట్టారు. రైతుబంధు ఆపాలంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్నికల సంఘానికి లేఖ రాయగా రైతులకు రైతుబంధు ఇవ్వడం దుబారా అంటూ ఆ పార్టీ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించడం తెలంగాణ ప్రజలకు అభివృద్ధి జరుగుతుంటే నిరోధించడానికే ఈ పార్టీ కంకణం కట్టుకున్నట్లుగా ఉన్నదని ఆరోపించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి విజయవంతంగా అమలవుతూ దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణ దూసుకెళ్తుంటే కాంగ్రెస్ పార్టీ ఓర్చుకోలేక పోతున్నదన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే గడ్డం గీసుకోనని ఉత్తమ్ చెప్పారని ఇప్పుడేమో 50 వేల ఓట్లకు తగ్గితే రాజకీయాలకు దూరమవుతానని ప్రకటిస్తున్నారని ఈ సారి ఆయనను రాజకీయాలకు దూరంగా ఉంచడానికే ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పెద్ద బ్లాక్ మెయిలర్ అని సెటిల్‌మెంట్ చేయడంలో, బ్రోకర్‌గా వ్యవహరించడంలో ఆనకు మరెవరూ సాటిరారని ఆ పార్టీ నేతలు భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా ఆరోపిస్తుంటే సిగ్గు శరం లేకుండా బీఆర్ఎస్‌పై దిగజారుడు వ్యాఖ్యలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు.

ఘనంగా అంతర్జాతీయ చెఫ్స్ డే

రక్తదానం చేసిన విద్యార్థులు



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్: రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ చెఫ్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా చెఫ్స్ డేను నిర్వహిస్తుండగా రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈ వేడుకలు క్రమం తప్పకుండా జరుపుతున్నారు. ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులు రక్తందానం చేశారు. నోవాటెల్ ఎయిర్‌పోర్ట్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ వరుణ్, పార్క్ హయత్ మాస్టర్‌చెఫ్ అతర్, అబోర్డ్ హోటల్స్ కార్పొరేట్ చెఫ్ రమేష్ యాదవ్, సతీష్‌కుమార్ తదితరులు ఈ బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో 86 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి తెలిపారు.

ఎముకల సాంద్రతను పరీక్షించుకోవాలి

బంజారాహిల్స్: గట్టి ఎముకల నిర్మాణంపై దృష్టి కేంద్రీకరిస్తూ ఎముకల ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని ఎముకల సాంద్రతను పరీక్షించుకోవాలని విరించి ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నటేష్ సూచించారు. ప్రపంచ ఆస్టియో ఫోరోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో వారం రోజుల పాటు ఉచిత వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం ఈ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ మధ్య వయసు దాటినవారందరూ నియమిత కాలంలో ఈ పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. దీని ద్వారా ఏర్పడే పలు ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎలా దూరం చేసుకోవచ్చో అవగాహన కలిగించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ ప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ కె.ఎస్. నాయక్, డాక్టర్ శ్రీదేవి దత్తా, డాక్టర్ బేలూహ, వేదుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని కబ్జా చేసిన రౌడీ షీటర్: యజమానికి బెదిరింపులు

వెంగళరావునగర్: ఎల్లారెడ్డిగూడలోని ఓ ఇంటిని రౌడీషీటర్ అక్రమించడమే కాకుండా ఇల్లు ఖాళీ చేయాలంటే రూ. ఐదు లక్షలు కావాలంటూ బెదిరిస్తున్నాడంటూ యజమాని మధురానగర్ పోలీసులను వేడుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే ఒక వ్యాపారికి ప్లాట్ 8బిలో (ఇంటి నెంబర్ 8-3-318/8/బి-3)లో ఉన్న ఇంటిని కార్తీక్ అనే వ్యక్తి కొంతకాలం నుంచి అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గత 15 రోజుల కిందట కార్తీక్ నుంచి ఇంటి యజమానికి మెసేజ్ వచ్చింది, తనను ఓ గుర్తు తెలియని వ్యక్తి ఖాళీ చేయమని బెదిరస్తున్నాడని, తాను అక్కడ నుంచి ఖాళీ చేస్తున్నామని మెసేజ్ పంపాడు. విషయం తెలుసుకున్న యజమాని కుమారుడు అక్కడకు వెళ్లి చూడగా అప్పటికే తాము కిరాయికి ఇచ్చిన ఇంట్లో గువ్వల పవన్‌కుమార్ అనే వ్యక్తి ఉన్నాడు. తాను ఇంటిని కబ్జా చేశానని, ఇంటిని ఖాళీ చేయాలంటే రూ. 5 లక్షలు ఇవ్వాలని, లేని పక్షంలో మీ కుటుంబాన్ని అంతం చేస్తానని కత్తితో బెదిరించాడు. గురువారం సాయంత్రం సదరు గృహ యజమాని మధురానగర్ పోలీసుల వద్ద తన ఆవేదనను వ్యక్తం చేశారు. తాను ఫిర్యాదు చేస్తే చంపేస్తానని పవన్ కుమార్ అనే రౌడీషీటర్ బెదిరిస్తున్నట్టుగా పేర్కొన్నారు. పోలీసులు కేసును సుమోటోగా తీసుకుని ఇంటికి వెళ్లి రౌడీషీటర్‌ను ఇల్లు ఖాళీ చేయించారు. అనంతరం ఆ ఇంటిని గృహ యజమానికి అప్పగించారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి: మాగంటి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: బీఆర్ఎస్ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే తమ పార్టీకి భారీ విజయాన్ని అందిస్తాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో ప్రచార వాహనాలను ప్రారంభించారు. అనంతరం షేక్‌పేట డివిజన్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా ఉందని, కాలనీలు, బస్తీల్లోని రోడ్లనే చూస్తే తెలుస్తుందన్నారు. సాయంత్రం జయప్రకాష్‌నగర్ కాలనీ వాసులతో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్‌పటేల్, దేదీప్య, నేతలు సంతోష్, డి.సంజీవ, ప్రదీప్‌కుమార్, విజయ్‌సింహా, నర్సింగ్‌దాస్ పాల్గొన్నారు.

దళితుల హక్కుల సాధనకు అవిశ్రాంత పోరు



నూతన కమిటీ సభ్యులతో దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేష్

శ్రీనగర్‌కాలనీ: దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని తెలంగాణ దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం అరుంధతి బంధు సేవా మండలి నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.పి.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి జి.బి.సత్యేంద్రకృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి డి.పవన్‌కుమార్‌లను రాష్ట్ర కార్యాలయంలో దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దళిత సేన ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్, హైదరాబాద్ అధ్యక్షుడు జి.భూపతిరాజ్, అరుంధతి బంధు సేవా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

వెంగళరావునగర్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద ఉన్న రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.... ఎల్లారెడ్డిగూడలో మధురానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవి తన సిబ్బందితో కలిసి ఇంజినీర్స్‌కాలనీ, ఎల్లారెడ్డిగూడ తదితర ప్రాంతాల్లో విస్తృత దాడులు చేశారు. ఓ వ్యక్తి వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఆయన పేరు గువ్వల పవన్‌కుమార్ అలియాజ్ బిల్లాపవన్ అని తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటానని తెలియజేశాడు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నట్టుగా ఒప్పుకున్నాడు. దాంతో అతనిని అదుపులోనికి తీసుకుని సోదా చేయగా దాదాపు 2 కిలోల గంజాయి దొరికింది. కేసు దర్యాప్తులో ఉంది.

బీఆర్ఎస్ షేక్‌పేట డివిజన్ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కార్యక్రమాలు అడ్డుకుంటానని అన్నందుకు షేక్‌పేట డివిజన్ ఫిలింనగర్ మహాత్మగాంధీ నగర్ బస్తీకి చెందిన టీడీపీ నేత పొత్రపల్లి శ్రీనివాస్ అనే దళితుడిపై దాడి చేసిన ఘటనలో షేక్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్‌పై ఫిలింనగర్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాలిలా... ఎంజీ నగర్‌కు చెందిన శ్రీనివాస్ ఇటీవల ఎమ్మెల్యే కార్యక్రమాలు అడ్డుకుంటానంటూ హెచ్చరించడాని దీంతో బీఆర్ఎస్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్, ఆయనను పిలిపించి తాను పిలవగానే ఎందుకు రాలేదంటూ దూషించాడు. తనకు పని ఉందని రాలేకపోయానని చెప్పడంతో అసభ్యంగా దూషించాడు. వెంటనే శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌కు వెళ్ళగా అక్కడ ప్రదీప్ తీవ్రంగా తిడుతూనే తనను రమ్మనగానే రాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతే కాకుండా తీవ్రంగా కొట్టాడు. కులం పేరుతో దూషించాడని నీ కుల సంఘాన్ని చూసుకొని నువ్వు ఎగురుతున్నావంటూ ఆగ్రహించాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రదీప్‌పై ఐపీసీ సెక్షన్ 323, 504, 506, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికే మద్దతు: సీపీఎం

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే తమ పార్టీ మద్దతు అని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్, నగర కమిటీ సభ్యుడు రాపర్తి అశోక్ ప్రకటించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ రాష్ట్ర నాయకత్వం తీసుకున నిర్ణయం మేరకు తామంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను గద్దెదించడమే లక్ష్యంగా తాము కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం శ్రమిస్తామని స్పష్టం చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు



కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు భద్రపరుస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 245 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఖైరతాబాద్ ఆర్‌వో వెంకటేష్ దోత్రే, ఏఆర్‌వో ప్రశాంతి తదితరులు సిబ్బందితో కలిసి వీటిని ముందుగా ఏర్పాటు చేసుకున్న ప్రణాళిక ప్రకారం స్ట్రాంగ్‌రూమ్‌లో వరుస క్రమంలో ఉంచారు. గట్టి భద్రత నడుమ విక్టరీ ప్లే గ్రౌండ్ నుంచి వీటిని స్టేడియంకు తరలించారు. నియోజకవర్గానికి 306 కంట్రోల్ యూనిట్లు, 306 బ్యాలెట్ యూనిట్లు, 343 వీవీ ప్యాట్లు కేటాయించడం జరిగింది.

ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ సంబరాలు

- ఖైరతాబాద్ కాంగ్రెస్ టికెట్ విజయారెడ్డిదే..
- ప్రజల్లో ఉంటూ పార్టీని పటిష్టం చేయడంతో టికెట్ కేటాయింపు



విజయారెడ్డికి మిఠాయిలు తినిపిస్తున్న కార్యకర్తలు, నాయకులు


బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి పీజేఆర్ కుమార్తె, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేరు ఖరారు కావడంతో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన పీజేఆర్ వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయారెడ్డి గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సీపీ తరపున పోటీ చేశారు. అయితే అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ఓటమి పాలయినా నిరంతరం ప్రజల్లోనే ఉంటూ తనదైన ముద్రను వేసుకున్న విజయారెడ్డి 2015లో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) పార్టీలో చేరారు. 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే టికెట్ కోసం పార్టీలో చేరినా కార్పొరేటర్‌గా ఖైరతాబాద్ బరిలో దిగి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో సైతం చివరి క్షణం దాకా ఖైరతాబాద్ టికెట్ రేసులో ఉన్న విజయారెడ్డికి కాకుండా మాజీ మంత్రి దానం నాగేందర్‌కు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చారు. 2021లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మరోసారి ఖైరతాబాద్ కార్పొరేటర్‌గా విజయం సాధించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ టికెట్ సాధించడమే లక్ష్యంగా పావులు కదిపిన విజయారెడ్డి సుమారు ఏడాది క్రితం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. బలమైన క్యాడర్‌ను కలిగి ఉండటంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్న నాయకురాలిగా పేరు సంపాదించుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన అన్ని సర్వేలలో విజయారెడ్డి అయితేనే నియోజకవర్గంలో గట్టిపోటీ ఇవ్వగలదని తేలింది. దీంతో విజయారెడ్డిని ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఖరారు చేశారు. నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను ఆశించిన రోహిన్‌రెడ్డిని సముదాయించి అంబర్‌పేట టికెట్ ఇవ్వడంతో విజయారెడ్డికి మార్గం సుగమం అయింది.

119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్

హిమాయత్‌నగర్: తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ తెలిపారు. ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 12 శాతం రిజర్వేషన్ల కోసం త్వరలో దేశవ్యాప్త చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ అధికారంలోకి వస్తే 50 సంవత్సరాలు దాటిన వారికి, వృద్ధాప్య, వికలాంగుల, వితంతువుల పెన్షన్ రూ. 7500 ఇస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు రూ. 5 లక్షలు రుణ మాఫీ ఇస్తామన్నారు. రైతు భరోసా తీసివేసి వడ్డీ లేని రుణం ఇస్తామన్నారు. ప్రతి ఇంటికీ ఉచిత కరెంటు, పరిశ్రమల స్థాపనకు విదేశీ పెట్టుబడులు తెప్పించి వడ్డీ లేని రుణం ఇస్తామన్నారు. వక్ఫ్ బోర్డు, దేవాలయాల భూములను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు 2 ఎకరాలు ఉచితంగా ఇస్తామన్నారు. తెలంగాణ ప్రెసిడెంట్ మొహమ్మద్ బాబర్, సయ్యద్ సైదా, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో బీఆర్ఎస్ ప్రచారం: చింతల



జీహెచ్ఎంసీ కార్మికులకు కరపత్రాలు ఇస్తున్న చింతల రామచంద్రారెడ్డి

పంజగుట్ట: విప్లవాత్మక, సాహసోపేతమైన నిర్ణయాలతో, సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషిచేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంటే తెలంగాణలో మాత్రం అబద్ధపు, మోసపూరిత మాటలతో అధోగతి చేస్తున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బూత్‌దర్శన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోమాజిగూడ డివిజన్‌లో గడపగడపకూ బీజేపీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుందన్‌బాగ్, మెథడిస్ట్ కాలనీల్లో ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మాత్రమే అభివృద్ధి జరిగిందని, దానం నాగేందర్ నాలుగున్నర సంవత్సరాలు ప్రజలకు కనిపించకుండా పోయి ఎన్నికలు సమీపించగానే ఇప్పుడు మళ్లీ మాయమాటలు చెప్పేందుకు వస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.